మావోయిస్టులతో చర్చలెందుకు జరపరు ?

- ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి
- అటవీ సంపద, వనరులను కార్పొరేట్లకు అప్పగించొద్దు
- నంబాల కేశవరావు, మావోయిస్టుల హత్యపై న్యాయ విచారణ చేపట్టాలి
- వామపక్ష నేతల డిమాండ్

నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు కాల్చి చంపడాన్ని వామపక్ష పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర బలగాలు చేపట్టిన నరమేధాన్ని తక్షణమే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను అంతం చేయడం కోసం పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరిపే మోడీ ప్రభుత్వం మావోయిస్టులతో శాంతిచర్చలు ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. వెంటనే చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల హత్యపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో న్యాయ విచారణ జరపాలని అన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని చెప్పారు. ఆదివాసీ జాతి హననం ఆపాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మావోయిస్టుల హత్యను ఖండించండి, మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వ హత్యాకాండ, ఆదివాసీలపై హింసను వ్యతిరేకించాలి, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి, మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలి, మావోయిస్టుల హత్యపై న్యాయ విచారణ జరపాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు.

సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ఈ దాడులు : ఎస్ వీరయ్య

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై నరమేధాన్ని వెంటనే ఆపాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని కోరారు. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలన్నారు. అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిని అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థల అధిపతులకు అప్పగించడం కోసమే ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని విమర్శించారు. శాంతిభద్రతల సమస్యను సృష్టించి బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని అన్నారు. డెడ్‌లైన్ విధించి మావోయిస్టులు, ఆ సంస్థలను అంతం చేస్తామంటూ కేంద్రం ప్రకటించిందని చెప్పారు. ఇలాంటి భయానక దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణ జరపాలని కోరారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యగా చూడడం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలని అన్నారు. మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. సంపదను బడాబాబులకు ఎలా కట్టబెట్టాలన్నదే మోడీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మావోయిస్టులను సాకుగా చూపి దాడులు చేస్తున్నదని అన్నారు. మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. చర్చలు జరపకుండా వారిని ఏరివేయడం ఫాసిస్టు ప్రభుత్వ లక్షణమని విమర్శించారు. ఉగ్రవాదుల సమస్య పరిష్కారానికి పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న మోడీ ప్రభుత్వం రాజకీయ సమస్య పరిష్కారానికి మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. ప్రజా సమస్యలు పరిష్కారం కాకుంటే మావోయిస్టులు కాకుంటే మరో రూపంలో ప్రతిఘటన వస్తుందన్నారు. ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవడం కోసం ప్రజలు ముందుకొస్తారని చెప్పారు.

ప్రజావాణిని మోడీ పట్టించుకోవడం లేదు : పశ్యపద్మ

మావోయిస్టులతో చర్చలు జరపాలంటూ ప్రజలు, మేధావులు కోరుతున్నా ప్రధాని మోడీ ఎందుకు పట్టించుకోవడం లేదో సమాధానం చెప్పాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ డిమాండ్ చేశారు. మావోయిస్టుల హత్యపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరపాలని కోరారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎంత మంది నక్సలైట్లను పొట్టనపెట్టుకున్నారో, ఎంత మంది గాయపడ్డారో పూర్తి వివరాలతో శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. ఇది ప్రజాస్వామిక పాలనా, హిట్లర్ నియంత పాలనా?అని ప్రశ్నించారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం హన్మేష్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను అణచివేస్తున్నారని విమర్శించారు. అడవుల నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టి ఆ సంపద, ఖనిజాలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అప్పజెప్పడం కోసమే ఈ కుట్ర జరుగుతున్నదని అన్నారు. దేశంలో నిర్మూలించాల్సింది సంస్థలు, వ్యక్తులను కాదనీ, పేదరికం, ప్రజల సమస్యలను అని చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77 ఏండ్లు అయినా పేదరికం ఎందుకుందని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఆపాలని, మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్‌బాబు, పి ఆశయ్య, ఎం అడివయ్య, ఎం వెంకటేశ్, సిపిఐ నాయకులు స్టాలిన్, కె కాంతయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు, జెవి చలపతిరావు, కె గోవర్ధన్, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు ఎస్‌-ఎల్ పద్మ, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పస్యా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాలడుగు భాస్కర్, సిఐటియు నాయకులు

పస్యా జీవితం ఆదర్శనీయం

- ఆయన ఆశయాలతో ముందుకు సాగుదాం : పాలడుగు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికోద్యమానికి ఎనలేని కృషి చేసిన పస్యా సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ స్మరించుకున్నారు. పస్యా వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, కార్యదర్శులు జె వెంకటేష్, పుప్పాల శ్రీకాంత్, కూరపాటి రమేష్, కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సుధాకర్, వై సోమన్న, ఎ సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. సింగరేణి కార్మికునిగా పస్యా జీవితం ప్రారంభించారనీ, యూనియన్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్న సమయంలో యాజమాన్యం ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించిందని గుర్తుచేశారు. ఆ తర్వాత ఆయన పూర్తికాలం కార్మిక ఉద్యమానికి అంకితమై వివిధ బాధ్యతల్లో సమర్ధవంతంగా పనిచేశారని కొనియాడారు. కార్మిక లోకం మానసపుత్రికను తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే అయిన తర్వాత కూడా ప్రజాసేవ చేస్తూనే కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఎస్. వీరయ్య మాట్లాడుతూ రాజకీయ అంశాలపై పస్యాకు అపారమైన పట్టు ఉండేదని, కార్మికలోకం, ప్రజాశక్తి పత్రికల్లో అనేక వ్యాసాలు రాసేవారని గుర్తుచేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలిచిన పస్యా సత్యనారాయణ ఆశయాల సాధనకు పునరంకితం కావడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు.

29 నుంచి గ్రూప్-2 అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- జూన్ 10 వరకు హైదరాబాద్‌లో నిర్వహణ : నవీన్ నికోలస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 అభ్యర్థులకు ఈ నెల 29 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల పదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి హైదరాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (పొట్టి శ్రీరాములు)లో ఈ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థుల జాబితాను టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు అవసరమైన సమాచారాన్ని వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని కోరారు. ఈనెల 27 నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు గ్రూప్-2 అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురాకపోతే మరుసటిరోజు తేవాలని సూచించారు. ఆ తర్వాత అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. కేటాయించిన తేదీలో అభ్యర్థులు గైర్హాజరైతే మరుసటిరోజు హాజరయ్యేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అయినా రాకుంటే ఆ తర్వాత జరిగే ప్రక్రియకు అనర్హులవుతారని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన, గైర్హాజరు, తిరస్కరణ, వెబ్‌ఆప్షన్ల నమోదులో ఇబ్బందుల వల్ల సరిపోయినంత మంది ఎంపిక కాకుంటే అదనంగా ధ్రువపత్రాల పరిశీలన కోసం ఎంపిక చేస్తామని వివరించారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-2 పోస్టులకు 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారి కోసం గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 33 జిల్లాల్లో రాతపరీక్షలను నిర్వహించారు. వారిలో 2,49,964 మంది అభ్యర్థులు అన్ని పేపర్లకూ హాజరయ్యారు. వారిలో 2,36,649 మంది అభ్యర్థులు జనరల్ ర్యాంకింగ్ జాబితా (జిఆర్‌ఎల్)కు అర్హత సాధించారు.

ప్రభుత్వ పరిశీలనలో మెట్రో సెకండ్ ఫేజ్ డిపిఆర్‌లు

- రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో.. త్వరలో కేంద్రానికి : మెట్రో ఎండి
- మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డిపిఆర్ రెడీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మెట్రో రైల్ డిపిఆర్‌లు పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించినట్టు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మెట్రో రెండో దశ(బి)కి సంబంధించిన డిపిఆర్‌లు పూర్తి స్థాయిలో తయారయ్యాయని, వాటిని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఈ నెల ఎనిమిదిన ఆమోదించిందని స్పష్టం చేశారు. ఆ డిపిఆర్‌లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లభించే వరకు వీటికి సంబంధించి గోప్యత పాటించాల్సి ఉంటుందని, అందువల్ల పూర్తి వివరాలు అందించలేకపోతున్నామని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు జెబిఎస్ మెట్రో జంక్షన్‌ను అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు డిపిఆర్‌లో పలు అంశాలను పొందుపరిచామని చెప్పారు. రూ.19,579 కోట్ల అంచనాతో 86.1 కి.మీ పొడవు గల జెబిఎస్-మేడ్చల్, జెబిఎస్-శామీర్‌పేట్, ఎయిర్ పోర్ట్ ఫ్యూచర్ సిటీ మెట్రో ఫేజ్-2(బి) కారిడార్ల ప్రతిపాదనలతో డిపిఆర్‌లను పూర్తి చేశామని పేర్కొన్నారు. జెబిఎస్ స్టేషన్- మేడ్చల్ మార్గం 24.5 కిలోమీటర్లు, 18 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌గా ఉంటుందని తెలిపారు. జెబిఎస్ స్టేషన్- శామీర్‌పేట్ మార్గం 22 కిలోమీటర్ల కారిడార్ 14 స్టేషన్లతో నిర్మాణం అవుతుందని, ఈ మార్గం 20.35 కిలోమీటర్ల ఎలివేటెడ్‌గాను, 1.65 కిలోమీటర్లు భూగర్భ మార్గంగా ఉంటుందని అన్నారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో ఈ భూగర్భ మార్గం ఉంటుందని మెట్రో ఎండి తెలిపారు. ఆర్‌జిఐఎ - ఫ్యూచర్‌సిటీ(స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లుండగా దీనిలో ఎయిర్‌పోర్ట్ నుంచి 1.5 కిలోమీటర్ల భూగర్భ మార్గంగాను 21కిలోమీటర్ల ఎలివేటెడ్‌గాను, 17 కిలోమీటర్లు ఎట్ గ్రేడ్ గాను ఉంటుందని చెప్పారు. ఇది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పెద్ద గోల్కొండ, రావిర్యాల్ మీదుగా స్కిల్స్ యూనివర్సిటీ వరకు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఇతర రాష్ట్రాల్లో మెట్రో రైల్ నిర్మాణ అంచనాలు, హైదరాబాద్‌లో ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రెండో దశ(బి) డీపీఆర్‌లను సమగ్రంగా రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్టు స్పష్టం చేశారు.

నేడు సంగారెడ్డికి సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం కేంద్రీయ విద్యాలయాన్ని సిఎం ప్రారంభిస్తారు.రూ.494.67 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టను న్నారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగసభకు సిఎం హాజరుకానున్నారు.

ఆఫీసుకు ఆలస్యంగా రావడమేంటి?

- మార్కెటింగ్ శాఖ అధికారులపై మంత్రి తుమ్మల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్కెటింగ్ శాఖ అధికారులు, ఉద్యోగుల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి వారు ఆలస్యంగా రావడంపై ఆయన సీరియస్ అయ్యారు. గురువారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రధాన కార్యాలయంలో ఫేస్ రికగ్నేషన్‌తో పాటు బయో మెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలస్యంగా వచ్చిన సిబ్బంది మీద వెంటనే మెమో ఇచ్చి, సంజాయిషీ తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు 53 మంది రెగ్యులర్ సిబ్బందిలో 16 మంది ఆలస్యంగా హాజరయ్యారనీ, 42 ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో 5గురు మాత్రమే ఆలస్యంగా హాజరయ్యారనీ, వారికి మెమో జారీ చేశామని తెలిపారు. ఇకపై ఆలస్యంగా వచ్చిన అధికారులు, అందుబాటులో లేని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను ఆదేశించారు.

బిసి గురుకుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకులాల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెబ్‌సైట్ www.mjptbcwreis.telangana.gov.in,https://mjptbcadmissions.org లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. బిసి గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో 6,832 బ్యాక్‌లాగ్ సీట్లు ఉండగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో 23,611 మంది ఏప్రిల్ 20న పరీక్ష రాశారని తెలిపారు. ఈనెల 24న(శనివారం) కౌన్సిలింగ్ ఉంటుందనీ, మెరిట్ వచ్చి, ఎంపికైన విద్యార్థులు తమ సర్టిఫికెట్లన్ని సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలి

- సిఎస్ రామకృష్ణారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూన్ రెండున రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ వేడుకలకు కావలసిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉన్నతాధికారులతో డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్టు సిఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్‌పార్క్‌ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారని వివరించారు.

ఈ సందర్భంగా పరేడ్‌గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సిఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ప్రూఫ్ షామీయానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు.

సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలనీ, దీంతో పాటు జనరేటర్ బ్యాకప్ కూడా అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. డిజిపి జితేందర్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ హరీష్, జలమండలి ఎండి అశోక్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, ఆయా శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు.

ఐదు లక్షలమందికి రాజీవ్ యువవికాసం

- జూన్ 2న లబ్దిదారులకు శాంక్షన్ లెటర్లు
- ప్రభుత్వ లక్ష్యానికి బ్యాంకర్లు సహకరించాలి
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఐదు లక్షల మందికి రాజీవ్ యువ వికాస పథకం కింద ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు బ్యాంకర్లు సహకరించాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ప్రభుత్వ లక్ష్యాలను వారికి వివరించారు. యువత మేధస్సును ఉత్పత్తి రంగంలో వినియోగించి జిడిపికి పెద్ద ఎత్తున ఉపయోగ పడేలా రాజీవ్ యువ వికాస పథకం తీసుకువచ్చామని అన్నారు. "యువతకు రూ. తొమ్మిది వేల కోట్ల సాయం చేసే పథకం దేశ చరిత్రలో ఏ రాష్ట్రం ఇప్పటి వరకు తీసుకురాలేదు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 6,250 కోట్లు సబ్సిడీ రూపేణా ఇస్తోంది. గతంలో యువతకు స్వయం ఉపాధి కింద 70 శాతం రుణం, 30 శాతం సబ్సిడీ ఉండేది. ఇప్పుడది రివర్స్‌గా ఉందన్న విషయాన్ని బ్యాంకర్లు గ్రహించాలి. రూ. 8 లక్షల కోట్ల పైబడి లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక రుణ ప్రణాళికలో రాజీవ్ యువ వికాస పథకం కోసం బ్యాంకర్లు 0.2 శాతం మాత్రమే వెచ్చించాల్సి ఉంటుంది. జూన్ 2న 5 లక్షల మంది యువతకు శాంక్షన్ లెటర్లు పంపిణీ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించండి. క్షేత్రస్థాయిలో అన్ని బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షించి లక్ష్యాన్ని చేరుకునేలా తోడ్పడండి" అని భట్టి బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మానవ వనరులు అభివృద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ముందుకు వెళు తున్నదని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. విద్య పైన పెద్ద ఎత్తున దృష్టి సారించి స్కూల్ నుంచి యూనివర్సిటీ వరకు ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నామని తెలిపారు.

వ్యవసాయానికి ప్రాధాన్యత...

వ్యవసాయానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని భట్టి తెలిపారు. ఉద్యానవన పంటలతో పాటు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పంట రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ ఏకకాలంలో రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేశామని గుర్తు చేశారు. పెట్టుబడి సాయంగా రైతులకు రైతు భరోసాతో పాటు రైతు బీమా ప్రీమియం డబ్బులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తున్నదని తెలిపారు.

రూ.12,600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం

గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచడానికి ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించినట్టు భట్టి చెప్పారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన 6.70 లక్షల ఎకరాలను సౌర విద్యుత్ ద్వారా సాగులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12,600 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ఏడాది వడ్డీ లేకుండా రూ.20 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామని తెలిపారు. రానున్న నాలుగేండ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్టీసీలో అద్దె బస్సులతో పాటు సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడానికి సహకారం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చి 2030 నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళుతన్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవం కోసం చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

జనానికి "జయత్రి" కుచ్చుటోపి

- ప్లాట్లు, కమర్షియల్ స్పేస్ పేరిట రూ.700 కోట్లు వసూలు
- మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న యాజమాన్యం
- ఎట్టకేలకు అరెస్ట్...తూతూ మంత్రంగా కేసు నమోదు
- లబోదిబో అంటున్న బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెయ్యి రూపాయలు మోసం చేసినా.... వెయ్యి కోట్లు మోసం చేసినా ఒకటే కేసు. చట్టంలోని లొసుగులు ఆర్థిక నేరస్థులకు చుట్టంగా మారాయి. వాటిని ఆసరా చేసుకుని రియల్ ఎస్టేట్ పేరిట కొంతమంది భారీ మోసాలకు పాల్పడుతున్నారు. తక్కువ ధరకే విల్లాలు... ప్లాట్లు అంటూ మధ్యతరగతిని నిండా ముంచుతున్నారు. తాజాగా వెలుగు చూసిన ఉదంతం ఆ కోవలోనిదే..

జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాకర్ల శ్రీనివాస్ 2021లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. కొల్లా వీర వెంకట సత్యనారాయణ మూర్తి, రాజేష్ దిండు. యెల్లంటి చంద్ర శేఖర్, మల్లయ్య సానెం, కొల్లా శ్రీనివాసరావు, హరిప్రసాద్ నాగుబండి, బొల్లా శ్రీనివాసరావులు కంపెనీ డైరెక్టర్లుగా ఉన్నారు. హైదరాబాద్‌లోని బాచుపల్లి, గోపనపల్లి మొదలగు ప్రాంతాల్లో వెంచర్లు ఏర్పాటు చేశారు. వాటిపై పెట్టుబడి పెడితే మంచి రాబడి ఉంటుందని ఏజెంట్లు, బ్రోకర్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా ప్రజలను నమ్మించారు. ప్లాట్ల విక్రయంతో పాటు బైబ్యాక్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ. పది లక్షల నుంచి రూ.కోటి వరకు ఒక్కొక్కరి నుంచి వసూలు చేశారు. 2021 నుంచి 2022 వరకు జయత్రి సంస్థ దాదాపు రెండు వేల మంది దగ్గర రూ.700 కోట్ల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఇందులో విల్లాలు, ప్లాట్ల నిర్మాణం పేరిట నిధులను సమీకరించారు. ఆరంభంలో పెట్టుబడి పెట్టిన పలువురు... ప్లాట్ల అప్పగింత, కమర్షియల్ స్పేస్‌ల అద్దెల కోసం డిమాండ్ చేయడంతో సంస్థకు తాళాలు వేశారు. దాంతో కొంతమంది కెపిహెచ్‌బి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 2002 డిసెంబర్‌లో కాకర్లతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి చేతులు దులుపు కున్నారు. అప్పటి నుంచి వారు తప్పించుకు తిరుగుతున్నారు. బాధితులు ఎన్ని సార్లు పోలీసులకు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. తాజాగా శుక్రవారం ఎండి కాకర్లతో పాటు పలువురు డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేసి మరోసారి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పలువురు బాధితులు కెపిహెచ్‌బి పోలీసులను ఆశ్రయిస్తే వారి వివరాలు నమోదు చేసుకుని పంపించారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి హామీ ఇవ్వలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు లాభాలు వద్దనీ, చెల్లించిన అసలు నగదు ఇవ్వాలని వారు వేడుకుంటున్నారు. తమను మోసం చేసిన రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

రూ. 500 కోట్లు దారి మళ్లింపు?

జయత్రి సంస్థ ప్లాట్ల పేరిట జనం దగ్గర దాదాపు రూ.700 కోట్ల వరకు వసూలు చేసినట్టు బాధితులంటున్నారు.. బాచుపల్లి, కోకాపేట తదితర ప్రాంతాల్లో తూతూ మంత్రంగా అపార్ట్ మెంట్ల నిర్మాణాన్ని మొదలుపెట్టి మధ్యలో వదిలేశారు. వాటిని ప్రారంభించిన సమయంలో 2021 నుంచి 2022 వరకు రెండేళ్లలో ఏజెంట్లు, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రజలను ఆకర్షించి నిధులను సేకరించారు. అయితే వసూలు చేసిన మొత్తాన్ని విల్లాలు, ప్లాట్ల నిర్మాణం వైపు మళ్లించలేదనే ఆరోపణలున్నాయి. ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని డైరెక్టర్ల బంధువులు, స్నేహితులు ఇతర బినామీల పేరిట ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టినట్టు బాధితులు ఆరోపించారు.

రేరా మధ్యంతర ఉత్తర్వు....

జయత్రి సంస్థ బాధితులు జయ డైమండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలో 2022లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుపై చర్య తీసుకున్న రేరా ప్రాజెక్ట్‌లోని ఇతర ప్లాట్లు అమ్మకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆలస్యానికి ఆర్థిక ఇబ్బందులే కారణమని కంపెనీ రేరాకు తెలిపింది. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సేకరించిన నిధులను ఎలా ఉపయోగించారనే దానిపై సమాచారాన్ని కంపెనీ ఇప్పటి వరకు వెల్లడించలేదు. మిగిలిన ప్లాట్లకు సంబంధించి రేరా ఇప్పటి వరకు తుది నిర్ణయం తీసుకోలేదు.

చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం
రాజశేఖర రెడ్డి. సిఐ, కెపిహెచ్‌బి, హైదరాబాద్

జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మోసాలపై చట్ట ప్రకారం చర్య తీసుకుంటాం. ఎండితో పాటు పలువురు డైరెక్టర్లను అరెస్ట్ చేశాం. త్వరలో అతనితో పాటు మిగతా వారిని కోర్టు ద్వారా కస్టడిలోకి తీసుకుని దర్యాప్తు చేస్తాం. కంపెనీ చేతుల్లో మోస పోయిన వారికి సానుభూతి తెలియజేయడం తప్ప మేమేం చేయలేం. డబ్బుల రికవరీ మా పని కాదు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో

O.S.No. 114/2023

Between:
నెక్కంటి సుబ్బారావు ...వాది
Vs
Md. అక్బర్ బాషా ...ప్రతివాది

To,
Md. అక్బర్ బాషా,
S/o. Not Known, నాన్‌చారీమాదుర్, తోట్రార్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణారాష్ట్రం.

పై నెంబరు దావాలో వాది మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన మీరు తీసుకోనందున మీ హాజరు నిమిత్తం **ది. 26-06-2025వ తేది గం. ఉదయం 10-30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా కాని, పరోక్షముగా కాని పై కోర్టు నందు హాజరై మీ వాదన దాఖలు చేసుకోవలెను. లేని యెడల పై నెంబరు కేసు మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపర్చడమైనది.

C.V.N. Kishore,
పాలకొల్లు Advocate, AP/995/1987
ది.21-05-2025 Palakol
Cell: 78930 70050

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో

O.S.No. 186/2023

Between:
వైట్ల సత్యనారాయణ ...వాది
Vs
చిట్టూరి అనంతలక్ష్మి & ఇతరులు ...ప్రతివాది

To,
D1. చిట్టూరి అనంతలక్ష్మి, W/o. వీర రాఘవులు, యల్లారెడ్డిగూడెం, ఇంజనీర్స్ కాలనీ, శ్రీసాయిరాం టవర్స్, ఫ్లాట్ నెం. 501, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.
D2. చిట్టూరి వెంకటేశ్వరరావు, S/o. వీర రాఘవులు, యల్లారెడ్డిగూడెం, ఇంజనీర్స్ కాలనీ, శ్రీసాయిరాం టవర్స్, ఫ్లాట్ నెం. 501, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.
D3. కానుమిల్లి పద్మ శ్రీదేవి, W/o. ఆదినారాయణ, యల్లారెడ్డిగూడెం, ఇంజనీర్స్ కాలనీ, శ్రీసాయిరాం టవర్స్, ఫ్లాట్ నెం. 501, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిన మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై నెంబరు కేసులో మీ హాజరు నిమిత్తం **ది. 14-07-2025వ తేది గం. ఉదయం 10-30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా కాని, పరోక్షముగా కాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నెంబరు కేసు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపర్చడమైనది.

C.V.N. Kishore,
పాలకొల్లు Advocate, AP/995/1987
ది.21-05-2025 Palakol
Cell: 78930 70050

ఎంపిడిఒల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపిడిఒలకు ఊరట లభించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫిబ్రవరి 2024లో బదిలీ అయిన 350కి పైగా ఎంపిడిఒల బదిలీలు చేపట్టాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఆ ఫైలుపై మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) గురువారం సంతకం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తమను తిరిగి బదిలీ చేయాలంటూ ఎంపిడివోలు పలుమార్లు ప్రభుత్వానికి, మంత్రికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒల బదిలీ ఫైల్‌పై మంత్రి డాక్టర్ సీతక్క సంతకం చేశారు. ఎంపిడివోలను వారి సొంత నియోజకవర్గాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని నిర్ణయించారు. సిఎం సంతకం అనంతరం బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో ఎన్నో నెలలుగా ఎదురుచూస్తున్న ఎంపిడిఒలకు ఊరట లభించినట్టయింది.

ఆరబెట్టిన ధాన్యాన్ని పాడు చేస్తున్న కోతులు

ధాన్యం కుప్పలపై కోతుల గుంపు

- రైతుల ధాన్యం వానరాల పాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చేవరకూ రైతుకు ఇబ్బందులు తప్పడం లేదు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో సొసైటీ ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం వద్ద గురువారం దాదాపు 50 కోతులు వరి ధాన్యంపై దాడిచేశాయి. వాటిని తింటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. రైతులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వడ్లు మొత్తం తడిసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరు పర్యంతమవుతున్నారు. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్నారు. వర్షాలకు తోడుగా కోతులూ ఇబ్బంది పెట్టడంతో దిక్కుతోచని పరిస్థితిలో రైతులున్నారు.

12 ఎస్‌సి గురుకుల జూనియర్ కాలేజీల మూసివేత

- విద్యార్థుల్లేరనే సాకుతో సర్కారు నిర్ణయం
- అక్కడ చదువుతున్న వారిని వేరే కళాశాలల్లోకి మార్పు
- ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ (టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్) ఆధ్వర్యంలోని 12 జూనియర్ కాలేజీలు మూతపడుతున్నాయి. సరిపోయినంత మంది విద్యార్థులు చేరడం లేదనే సాకుతో వాటిని ఎత్తేయాలని టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ నిర్ణయించింది. అక్కడ చదువుతున్న విద్యార్థులను దగ్గరలోని టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ జూనియర్ కాలేజీల్లోకి మార్చాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం (2025–26) నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఆ 12 ఎస్‌సి గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందాలనే ఆశతో ఉన్న విద్యార్థులకు నిరాశే ఎదురు కానుంది. ఈ నిర్ణయం వల్ల దళిత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ఒక్కో జూనియర్ కాలేజీలో రెండు కోర్సుల చొప్పున ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 120 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 120 సీట్లు కలిపి 240 సీట్లుంటాయి. ఈ లెక్కన 12 ఎస్‌సి గురుకుల జూనియర్ కాలేజీల్లో 2,880 సీట్లు రద్దవుతాయి. అంటే పేద విద్యార్థులు ముఖ్యంగా దళిత విద్యార్థులు గురుకుల విద్యను కోల్పోతారు. టిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మసకబారుతున్న గురుకులాల ప్రతిష్ట

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు దీటుగా గురుకుల విద్యాసంస్థలు నడుస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తున్నాయి. గురుకులాల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తా చాటుతున్నారు. పది, ఇంటర్ ఫలితాలతోపాటు జేఈఈ, నీట్, ఎప్‌సెట్ వంటి ప్రవేశ పరీక్షల్లోనూ మంచి ర్యాంకులను సాధిస్తున్నారు. ఇంత మంచి చరిత్ర ఉన్నది.

పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గురుకులాలను అభివృద్ధి చేసేందుకే ప్రాధాన్యత ఇచ్చింది. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్యను అందించడంలో భాగంగా 293 ఉన్న గురుకులాలను 1023కి పెంచింది. ఇందులో ఎస్సీ గురుకులాలు 268 ఉన్నాయి. ఇందులో 1.50 లక్షల మంది చదువుతున్నారు. 238 ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీలున్నాయి. వాటిలో 31,564 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎస్సీ గురుకులాల్లో ఎంపీపీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. వాటిలో జేఈఈ, నీట్, ఎప్‌సెట్ కోచింగ్‌లపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. సాధారణ ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పదో తరగతి గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ) ఆధారంగా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఇంత ప్రతిష్ట ఉన్న ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లోని మొత్తం సీట్లలో ఇప్పుడు విద్యార్థులు చేరడం లేదు. గురుకులాల్లోనూ సీట్లు మిగిలే దుస్థితికి చేరుకున్నాయి. దీంతో వాటి ప్రతిష్ట మసకబారుతున్నది.

మూసివేసే 12 గురుకుల జూనియర్ కాలేజీలు

జిల్లా	విద్యాసంస్థ ప్రాంతం
1. జోగులాంబ గద్వాల	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఇటిక్యాల (బాలురు)
2. కరీంనగర్	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, చొప్పదండి (బాలికలు)
3. భద్రాద్రి కొత్తగూడెం	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, భద్రాచలం (బాలికలు)
4. ఖమ్మం	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, సత్తుపల్లి (బాలురు)
5. ఖమ్మం	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, కూసుమంచి (బాలికలు)
6. మహబూబాబాద్	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, నర్సింహులపేట (బాలికలు)
7. సిద్ధిపేట	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, దుబ్బాక (బాలురు)
8. సంగారెడ్డి	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, రాయికోడ్ (బాలికలు)
9. కామారెడ్డి	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, బిచ్కుంద (బాలురు)
10. జయశంకర్ భూపాలపల్లి	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, కాటారం (బాలికలు)
11. జనగామ	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, నర్మెట్ట (బాలికలు)
12. మేడ్చల్ మల్కాజిగిరి	టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, మల్కాజిగిరి ఎఫ్ఏఎస్ (బాలికలు)

సమీకృత గురుకులాల పేరుతో ఆర్భాటం

ఇంకోవైపు గురుకులాల సంఖ్యను 293 నుంచి 1023కు గత ప్రభుత్వం పెంచినా వాటిలో 662 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మౌలిక వసతుల సమస్య, ఇతర కారణాలతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. సొంత భవనాలను నిర్మించి వసతులను మెరుగుపర్చాల్సిన ప్రభుత్వం ఆ కాలేజీల మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మరోవైపు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున సమీకృత గురుకులాలను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. 105 సమీకృత గురుకులాలను మంజూరు చేసింది. వాటిలో 58 సమీకృత గురుకులాల నిర్మాణం కోసం రూ.662 కోట్లు విడుదల చేసింది. రెండేండ్లలో వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఒకవైపు సమీకృత గురుకులాల పేరుతో ఆర్భాటం చేస్తూనే ఇంకోవైపు గతంలో ఉన్న 12 ఎస్సీ గురుకులాలను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ కాలేజీల్లో రూ.లక్షల ఫీజులతో విద్యావ్యాపారం చేస్తున్నాయి. గురుకులాల వల్లే కార్పొరేట్ కాలేజీల వల్ల తల్లిదండ్రులకు కొంత ఉపశమనం ఉన్నది. ఇప్పుడు 12 గురుకుల జూనియర్ కాలేజీలను మూసివేయడంతో కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారం పెంచడానికే ఉపయోగపడుతుందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

రాష్ట్రంలో 12 ఎస్‌సి గురుకుల జూనియర్ కాలేజీలను మూసివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు ప్రధానంగా అణగారిన వర్గాల వారికి డిగ్రీ వరకు విద్య అందుతున్నదని తెలిపారు. కార్పొరేట్ కాలేజీల్లో రూ.లక్షల ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ గురుకులాలు విద్యార్థులకు ఎంతో ఆసరాగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు 12 ఎస్‌సి గురుకుల జూనియర్ కాలేజీలను మూసేయడం ద్వారా పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఆ గురుకులాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. వాటిని అభివృద్ధి చేసి మరింత మంది విద్యార్థులకు ప్రవేశాలను కల్పించాలని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.

ఆటో, కారు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరస్వతీ పుష్కరాలకు వెళ్లి వస్తున్న కారు, పుష్కరాలకు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జయశంకర్–భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్‌కు రెండు కిలోమీటర్ల సమీపంలో భూపాలపల్లి–కాటారం జాతీయ రహదారిపై గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక శివారు కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబంలోని ఎనిమిది మంది ఆటోలో పుష్కర స్నానానికి కాళేశ్వరానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం పుష్కర స్నానానికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి–కాటారం జాతీయ రహదారిపై కారు–ఆటో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తుల కాళ్ళకు, చేతులకు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా కుమ్మరపల్లికి చెందిన విష్ణు (20), రజిత (32) మార్గమధ్యలోనే మృతి చెందారు. మరో ఇద్దరు నరసింహ, పిృథ్విక్‌కు తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మిగతా క్షతగాత్రులను, కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స అందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుద్ఘాతంతో యువరైతు మృతి

- రెండు బర్రెలు మృత్యువాత
- శంషాబాద్ మండలం తొండుపల్లిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ఘాతానికి గురై యువరైతు మృతిచెందారు. రెండు బర్రెలూ మృత్యువాతపడిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం తొండుపల్లి గ్రామానికి చెందిన పర్లగొల్ల శేఖర్ (30), గ్రామానికి చెందిన బక్క రత్నం వ్యవసాయ పొలంలో తన బర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు తన రెండు బర్రెలను మేపడానికి పొలం వద్దకు వెళ్లారు. అక్కడ బోర్ మోటార్‌కు సంబంధించిన స్టార్టర్.. ఫెన్సింగ్ కడీలకు బిగించి ఉంది. ఆ స్టార్టర్‌కు పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభం నుంచి కరెంటు తీసుకున్నారు. స్టార్టర్‌కు వచ్చిన సర్వీస్ వైరు, ఫెన్సింగ్ వైరు దగ్గర దగ్గరగా ఉన్నాయి. ఆ వైరు మెల్లమెల్లగా ఫెన్సింగ్ వైర్‌కు తగిలి తేలింది. తేలిన వైరు కారణంగా అక్కడ కడీలకు ఉన్న ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా అయ్యింది. యువరైతు శేఖర్ ఫెన్సింగ్ వైరు లోపలికి దాటే ప్రయత్నం చేస్తూ విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే మేత మేస్తున్న రెండు పశువులూ ఆ ఫెన్సింగ్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతునికి ఆరు నెలల క్రితమే వివాహం అయింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

యంత్రాలతో డంపింగ్

- ఇసుక క్వారీల్లో నిబంధనలు బేఖాతర్
- బేఖాతరు పాయింట్ వద్దకు..
- పనిచేయని సీఎం రేవంత్ హెచ్చరికలు
- క్యూబిక్ మీటర్‌కు రూ.220, లారీకి రూ.1500 ఇవ్వాల్సిందే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సహజ సంపదను ఆదాయ వనరులుగా మరల్చడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. ఏజెన్సీలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. అలాగే 1/70, పీసా, గిరిజన చట్టాలకు విరుద్ధంగా రేసింగ్ కాంట్రాక్టర్లు ఇసుక రీచ్‌ల నిర్వహణకు ప్రభుత్వ, ప్రయివేటు, రిజర్వ్ ఫారెస్ట్ భూములు అనే తేడా లేకుండా లక్షలాది క్యూబిక్ మీటర్ల కంకరను భారీ యంత్రాల సాయంతో తవ్వుతున్నారు. మైనింగ్, టిజిఎస్ఎండిసి అధికారులు మామూళ్లమత్తులో ఉండటం, దీనికి తోడు రాజకీయ నాయకుల ఒత్తిళ్ల నేపథ్యంలో తామేం చేయలేమంటూ మండల స్థాయి అధికారులు చేతులెత్తేస్తున్న పరిస్థితి. ఇందుకు ములుగు జిల్లా ఏజెన్సీలోని ఇసుక రీచ్‌లే నిదర్శనం.

ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట ఇసుక రీచుల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వెంకటాపురం మండలం యాకన్నగూడెం, ఇప్పగూడెం, రామన్నగూడెం ఇసుకరీచులను గిరిజన సంఘాల ద్వారా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్వహిస్తోంది. గిరిజన సంఘాలకు కేటాయించిన ఇసుకరీచుల్లో బినామీ కాంట్రాక్టర్లు అక్రమంగా ప్రవేశించి ఇసుక తవ్వకాల్లో భారీ అక్రమాలకు తెర లేపారు. గోదావరి నదిపై ఇసుక తవ్వకాలను మనుషుల ద్వారా చేపట్టి స్టాక్ యార్డ్ వరకు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేయాలి. ఈ నిబంధనలకు విరుద్ధంగా భారీ జేసీబీలు, టిప్పర్లను వినియోగిస్తున్నారు. గతంలో కొంతమంది కాంట్రాక్టర్లు అర్ధరాత్రి వేళ అక్రమ రవాణా చేసేవారు. కానీ, ఇప్పుడు పట్టపగలే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే అధికారులు తమ వైపు కన్నెత్తి చూడరంటూ కాంట్రాక్టర్లు బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. సొసైటీ ఇసుక క్వారీలో ఒక క్యూబిక్ మీటర్ ఇసుక గోదావరి నుంచి స్టాక్ యార్డుకు తీసుకొస్తే ప్రభుత్వం రైజింగ్ కాంట్రాక్టర్‌కు రూ.180, సొసైటీ సభ్యులకు రూ.40 చెల్లిస్తుంది. అంటే లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను బయటికి తీసుకువస్తే ఒక్క కాంట్రాక్టర్‌కు సుమారు రూ.1.80 కోట్ల నగదు ప్రభుత్వం చెల్లిస్తున్నదని తెలిసింది. యంత్రాలు వాడకూడదని జీవో ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. వెంకటాపురం మండలంలో సుమారు మూడు, వాజేడు మండలంలో ఒకటి ఇసుక క్వారీల్లో పట్టపగలే లారీలతో డంపింగ్ చేస్తున్నారు. ఇసుక కోసం ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న లారీకి ఇసుక రీచ్‌ల వద్ద ఎటువంటి రుసుం లేకుండా లోడింగ్ చేసి పంపాల్సి ఉంది. అయితే ఇసుక క్వారీల్లో లోడింగ్ చార్జీలు, నిర్వహణ పేరుతో రూ.1500 వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే పాయింట్ వద్దకు పంపిస్తున్నారు. ఎవరైనా ఇవ్వకపోతే వారికి సంబంధించిన లారీని పక్కన పెడుతున్నారు. ముందు చేసిన కొందరు రెండు మూడు రోజులైనా వేచి చూడాల్సిన పరిస్థితి. దాంతో ఇక్కడ ఎక్కువ రోజులు ఉంటే భారం అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తుందని ఇసుక లారీ డ్రైవర్లు ఇటీవల సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేసి వారి ఆవేదనను వ్యక్తం చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వం ఇసుక క్వారీల అనుమతులు ఇచ్చిన దగ్గర నుంచి డంపింగ్, రవాణా, ఆన్‌లైన్ అన్ని ములుగు జిల్లా టీజీఎస్ ఎండీసీ అధికారుల పర్యవేక్షణలో చేయాలి. కానీ, వెంకటాపురం మండలంలో ప్రారంభమైన ఇసుక క్వారీల్లో అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. క్వారీలను పరివేక్షిస్తున్న ఓ అధికారికి భారీ ఎత్తున ముడుపులు చెల్లించినట్టు కాంట్రాక్టర్లు బాహటంగానే చెబుతున్నారు. ఈ విషయమై టిజిఎండిసి పిఒను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. ఇసుక తవ్వకాలు, రవాణా పారదర్శకత పాటించాలని, ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని మైనింగ్‌శాఖ నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్వయంగా అనేక మార్లు హెచ్చరించినా అధికారుల్లో మార్పు లేదు.

అధికార పార్టీ ఒత్తిడితోనే కలెక్టర్ వత్తాసు : బిరెడ్డి సాంబశివ, సిపిఎం ములుగు జిల్లా కార్యదర్శి

అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళకు గురైన కలెక్టర్ ఇసుక ర్యాంపు నిర్వాహకులకు వత్తాసు పలుకుతున్నారు. రాంపుల్లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ఏకోజోన్ పేరుతో ఏటూరునాగారంలో మూసివేసిన రాంపులు ఇప్పుడు తిరిగి తెరుచుకున్నాయి. మంగపేట, ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో నిర్వహిస్తున్న ఇసుక సొసైటీల్లో అధికార పార్టీ నాయకుల ప్రమేయంతో నిబంధనలు నీళ్లకు వదిలారు. గోదావరి నదిలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నా కనీసం కలెక్టర్, మైనింగ్, టిజిఎస్ఎండిసి అధికారులు మౌనం వహిస్తున్నారు. అడవిని అన్యాక్రాంతం చేస్తున్నారన్న పేరుతో ఇసుక లారీల వద్ద సొమ్ములు వసూలు చేయడం కోసమే ఏటూరునాగారం సమీపంలో అటవీశాఖ అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. వెంకటాపురం మండలం ఇప్పగూడెంలో ఇసుక తరలించేందుకు ప్రభుత్వ భూమిని అధికారులు పట్టా చేశారు. సిపిఎం పోరాట ఫలితంగానే అది వెలుగులోకి వచ్చి ర్యాంపు నిలుపుదల చేశారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధుకు పితృవియోగం

- బలుగూరి రాంరెడ్డి మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధుకు పితృవియోగం కలిగింది. బలుగూరి రాంరెడ్డి (70) మృతి బాధాకరమని సిఐటియు రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఆయన మృతికి సంతాపం ప్రకటించింది. ఆయన కుమారుడు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధుకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. గురువారం ఈ మేరకు సిఐటియు అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంరెడ్డి అనారోగ్యంతో మరణించారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతారాంపురంలో అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెట్టిన బాలోత్సవం

- తెలుగు మాస్టర్ అంకమ్మ, తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ బాలోత్సవంలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి.. ప్రోత్సహించామని తెలుగు మాస్టర్ అంకమ్మ, తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 18 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా తెలుగు మాస్టర్ అంకమ్మ మాట్లాడుతూ.. విలువల బడిగా, సృజనకు గుడిగా సమ్మర్ క్యాంపు 18 రోజులు విజ్ఞానదాయకంగా, దేశభక్తియుతంగా, సందేశాత్మకమైన పాటలతో సాగిందని, తల్లిదండ్రులను మంత్రముగ్ధులను చేసిందని అన్నారు. ఆడపిల్లలు "కన్నీళ్లు కాదు కన్నెర్ర చేయాలి.. ఏడుపు కాదు.. ఎదురు తిరగాలి" లాంటి స్కిట్, డ్యాన్స్‌లు అలరించాయన్నారు. పేద పిల్లల పేగుబంధం బాలోత్సవం సమ్మర్ క్యాంప్ అని కొనియాడారు.

తెలంగాణ బాలోత్సవం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాలల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను పెంచామని, సంస్కృతి కళలను నేర్పించి క్రీడలను, ఇండోర్ గేమ్స్‌ను ప్రోత్సహించినట్టు తెలిపారు. శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ కల్చర్ గ్రామీణ వాతావరణాన్ని చూపించి ప్రకృతి పట్ల సమగ్రమైన అవగాహన కల్పించినట్టు చెప్పారు. శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించామన్నారు.

దేశభక్తిని పెంపొందించి సమాజంలో వారి పాత్రలను తెలియజేశామని, శ్రమ పట్ల గౌరవం, సమిష్టి తత్వాన్ని సోదరతత్వాన్ని, ప్రేమ తత్వాన్ని పిల్లల్లో పెంపొందించామని వివరించారు. సైన్సు, మూఢనమ్మకాలపై అవగాహన, ఇతరులకు సహాయపడటం, పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంచగలిగామన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో 85 మంది పిల్లలు 18 రోజులపాటు పాల్గొన్నారని తెలిపారు. పిల్లలంతా సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిధి అంటే కాచిగూడ, నారాయణగూడ, బాగ్‌లింగంపల్లి, నల్లకుంట్ల, చిక్కడపల్లి, రాంనగర్, పాలమూరు బస్తీ, అంబర్‌పేట, శంకర్ మఠ్ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేదలని చెప్పారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్కూల్ బ్యాగ్ బరువు పిల్లల బరువు కంటే 10 శాతం మించి ఉంటుందని, అందువల్ల బోధనా పద్ధతులు సులభతరం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆట స్థలాలు లేని బడులకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంప్‌లో పిల్లల ఆట పాటలు తల్లిదండ్రులతో కలిసి విన్నారు, కలిసి పాడారు, కలిసి భోజనం చేశారన్నారు. రెట్టింపు ఉత్సాహంతో తిరిగి 2026 సమ్మర్ క్యాంప్‌నకు స్వాగతం పలుకుతూ ప్రస్తుత సమ్మర్ క్యాంప్ ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి, డ్యాన్స్ మాస్టర్ గోపాల్, పాటల మాస్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో విద్యార్థులతో పాటు పాడుతున్న భూతి వెంకటేశ్వర్లు

మా పొట్ట కొట్టొద్దు..

- రోడ్డెక్కిన పండ్ల వ్యాపారులు
- 2 గంటలకు పైగా రాస్తారోకో
- రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాలని అధికారులు ఒత్తిడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఎన్నో ఏళ్లుగా ఇక్కడే పండ్ల వ్యాపారం చేసుకుని బతుకుతున్నాం.. ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో మా బతుకులను రోడ్డుపాలు చేయజూస్తున్నారు.. బండ్లను తొలగించి మా పొట్ట కొట్టొద్దు.." అంటూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో గురువారం పండ్ల వ్యాపారులు ఆందోళనకు దిగారు. స్థానిక పొట్టిశ్రీరాములు చౌక్ వద్ద రెండు గంటలకు పైగా రాస్తారోకో చేశారు. రోజంతా రోడ్డుపై నిల్చొని వ్యాపారం చేసుకుంటే అన్నీ పోను ఐదారు వందలు మిగులుతుంది.. కొన్నిసార్లు గిరాకీ లేక తెచ్చిన సరుకు పాడై నష్టపోతున్నాం.. ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరిట పండ్ల బండ్లు తొలగించాలని పోలీస్, మున్సిపల్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు.. రెండ్రోజులుగా మా బండ్లు రోడ్డుపై ఉండకుండా వేధిస్తున్నారు. మాకు ఈ అడ్డాలే దిక్కు.. ఇది లేకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినలేదు. ఎమ్మెల్యే, కమిషనర్ రావాలని, మా అడ్డాలు మా ఉంచేవిధంగా చూడాలని, మాకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. రోడ్డుపైనే పండ్లు పోసి నిరసన తెలిపారు. గత ఎన్నికల్లో అడ్డాలు తమకే ఉంటాయని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను చూసుకుంటానని నమ్మపలికి ఓట్లు వేయించుకొని ఇప్పుడు అడ్డాలు తొలగించాలనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పండ్ల బండను వెనక్కి పెట్టుకోవాలని పోలీసులు, మున్సిపల్ అధికారులు వేధిస్తున్నారని, వెనక్కి వెళ్తే షాపుల యజమానులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ముందుకు పోతే పోలీసులు, మున్సిపల్ అధికారుల వేధింపులు, వెనక్కి పోతే షాపుల యజమానుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తమ పట్ల అవమానకరంగా మాట్లాడినందుకు ఆందోళనకు దిగాల్సిన వచ్చిందన్నారు.

రోడ్డుమీద పండ్లు పడేసి రాస్తారోకో చేస్తున్న చిరువ్యాపారులు

ఎమ్మెల్యే హామీతో ఆందోళన విరమణ

సాగర్ రోడ్డుపై పండ్ల బండ్లు యథావిధిగా పెట్టుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారని కాంగ్రెస్ తాజా మాజీ కౌన్సిలర్లు షేక్ జావిద్, జానీ, ఆలగడప గిరిధర్ తెలిపారు. ప్రస్తుతం డీఎస్పీ అందుబాటులో లేనందున శుక్రవారం సాయంత్రం వరకు బండ్ల తొలగింపులు నిలిపివేయాలని పోలీసులకు చెబుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఎమ్మెల్యే హామీతో చిరు వ్యాపారులు ఆందోళన విరమించారు.

40 ఏళ్లుగా పండ్లు అమ్ముతున్నా: మరియమ్మ

సాగర్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద 40ఏళ్లుగా పండ్లు అమ్ముకొని జీవనోపాధి పొందుతున్నాను. నేను, నా భర్త, పిల్లలు ఈ బండి పైనే ఆధారపడి ఉన్నాం. రోజంతా కష్టపడితే ఐదారు వందలు మాత్రమే వస్తాయి. ఇప్పుడు బండ్లు తీసేయాలంటూ పోలీసులు, మున్సిపల్ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. బండి తీసేస్తే కుటుంబమంతా రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాకు న్యాయం చేయాలి.

మా అడ్డా మాకే ఉండేలా చూడాలి : బుజ్జి

నేను స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట 35 ఏండ్లుగా అరటిపండ్ల బండి నడుపుతున్నాను. మా బండి రోడ్డుకు చాలా దూరంలో ఉన్నది. ఐనా రోజూ పోలీసులు, అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ఇటీవల పోలీసులు నా బండిపై ఉన్న సరుకును బలవంతంగా తీసుకెళ్లారు. దాంతో 10 వేలకు పైగా నష్టం వచ్చింది. ఇప్పుడు సరుకు తెచ్చుకున్నాక మళ్లీ బండి తీసేయమంటున్నారు. బండి నడవకపోతే నా కుటుంబం ఎలా బతకాలి?

సంఘ సంస్కరణ ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ

- తెలంగాణ సాహిత్య అకాడమి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంఘ సంస్కరణ ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డి వర్మ అని తెలంగాణ సాహితి అకాడమి కార్యదర్శి నామోజు బాలచారి తెలిపారు. భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని అకాడమీ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ తెలంగాణ మట్టిలో పుట్టి మాణిక్యాల వలె వెలుగులు విరజిమ్మిన మహనీయులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. అందులో 'మాదిరి భాగ్యరెడ్డి వర్మ' ఒకరని తెలిపారు. ఆయన పుట్టింది అతి సామాన్య నిరుపేద కుటుంబంలో అయినప్పటికీ నిరంతర సామాజిక సేవ ద్వారా సంఘంలో సమున్నత స్థానం సంపాదించుకున్న గొప్ప మహనీయుడని కొనియాడారు. ఒకనాటి 'మాదిరి భాగయ్య' కాలం మారే కొద్దీ భాగ్యరెడ్డి వర్మగా సమాజంలో ఎలా పిలవబడ్డాడో ఆయన చరిత్ర చదివిన వారికి అర్థమవుతుందని పేర్కొన్నారు. బహుముఖ ప్రతిభ కలిగిన భాగ్యరెడ్డి వర్మ హైదరాబాద్ నగరంలో జన్మించడం మనందరికీ గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ సిబ్బందితోపాటు సాహితీవేత్తలు పాల్గొని నివాళులర్పించారు.